సాక్షి
తిరుపతి
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



వేడుకగా ఉగాది ఆస్థానం

జిల్లాలో శ్రీక్రోధి నామసంవత్సర ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. - 8లో



రాజకీయాలకే ఆదర్శం..

రాజకీయాలకే ఆదర్శం.. జగనన్న సంక్షేమమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధవారం(సా)

తిరుపతి	6-28
గూడూరు	6-23

న్యూస్‌రీల్

వాయులింగేశ్వరుని దర్శనం ..సర్వపాప హరణం



ఆలయ ధ్వజస్తంభం వద్ద శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం సర్వపాపహరణమని పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమ పీఠాదిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి అన్నారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని ఆయన శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 61,920 మంది స్వామివారిని దర్శించుకోగా 17,638 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శాకంబరీదేవిగా గంగమ్మ



శాకంబరీదేవి అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చివరిగా భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ కట్టాగోపీయాదవ్, సభ్యులు, ఈవో కె.మమత పాల్గొన్నారు.


అవినీతికి ఆద్యుడు చంద్రబాబు

శ్రీరంగరాజపురం : దేశంలోనే అతిపెద్ద అవినీతి చక్రవర్తి, రాష్ట్రంలో అవినీతికి ఆద్యుడు చంద్రబాబే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మంగళవారం ఎస్ఆర్‌పురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారం కోసం దేశంలో ఎన్ని పార్టీలూ ఉన్నాయో అన్నిటితోనూ జతకట్టడానికి చంద్రబాబు వెనకాడరని విమర్శించారు. 14 ఏళ్ల పాటు పాలించినా ఆయన పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకు రాదన్నారు. కరువు, కబ్జాలు, దోపిడీ, వెన్నుపోటు, నిరంకుశత్వం మాత్రమే గుర్తుకు వస్తాయని ఆరోపించారు. అదే జగనన్న పేరు చెబితే నవరత్న పథకాలు, వలంటీర్ వ్యవస్థ, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ వంటివి గుర్తుకు వస్తాయని వెల్లడించారు. మ్యానిఫెస్టోలో పెట్టిన 99 శాతం హామీలను అమలుచేసి ఎన్నికలకు వెళుతున్నామని, దొంగ హామీలతో కూటమి పార్టీలు వస్తున్నాయని వివరించారు. మీకు మంచి జరిగి ఉంటేనే మాకు ఓటేయండి అని చెప్పిన దమ్మున్న నేత జగనన్న అని కొనియాడారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులతో వస్తున్నారని, అయినప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నేడు ఉద్యోగుల పెన్షన్ అదాలత్

తిరుపతి అర్బన్: ఉద్యోగుల భవిష్యనిధికి సంబంధించి పెన్షనర్లు, మరో మూడు నెలల్లో ఉద్యోగ విరమణ పొందేవారు తమ సమస్యలను తెలుసుకోవడానికి కడప వారు వెబ్ ఎక్స్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల తెలిపారు. అదనపు సమాచారం కోసం 26431860531 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీటీడీ జేఈఓగా గౌతమి



తిరుపతి(అలిపిరి): టీటీడీ జేఈఓ(ఆరోగ్యం-విద్య)గా ఎం.గౌతమి మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీలోని పలువురు అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సేద్యానికి భరోసా!



రైతు భరోసా కేంద్రం ముందు లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది(ఫైల్)

నాడు

గత ప్రభుత్వ పెద్దలు వ్యవసాయం దండగ అంటూ హేళన చేసేవారు. సాగువైపు మొగ్గుచూపే రైతును ముప్పుతిప్పలు పెట్టేవారు. సబ్సిడీ విత్తనాల కోసం మండల కేంద్రాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయించేవారు. అవికూడా అరకొర సరఫరా చేసి చేతులెత్తేసేవారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు ప్రయివేటు దుకాణాలను ఆశ్రయించేవారు. వారు ఇచ్చే నాసిరకం విత్తనాలు, ఎరువులతోనే వ్యవసాయాన్ని నెట్టుకొచ్చేవారు. చివరకు పంట చేతికొచ్చినా మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గించేసేవారు గిట్టుబాటు ధరలేక.. సాగుకు చేసిన అప్పులు తీర్చలేక రైతులు కుమిలిపోయేవారు. పదుగురికి పట్టెడన్నం పెట్టే అన్నదాత అవమాన భారంతో ఉరితాడును ఎంచుకునేవారు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపించింది. విత్తు నుంచి పంట విక్రయం వరకు రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది. చినుకుపడి చేనుకెళ్తే చాలు.. రైతుకు గ్రామంలోనే అన్నీ అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన సిబ్బంది నియమించి వాటిపై రైతులకు అవగాహన కల్పించింది. అక్కడే నాణ్యమైన విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, సబ్సిడీ ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తెచ్చింది. పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేసి ప్రోత్సహించింది. దీంతో రైతులు ఆనందంగా సాగుచేస్తూ.. సిరులు పండిస్తూ.. మురిసిపోతున్నారు.

రైతుకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు

- విత్తు నుంచి విక్రయం వరకూ అన్నీ అక్కడే
- స్థానికంగానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు
- నకిలీ విత్తనాలకు చెక్
- సకాలంలో పంట నష్టపరిహారం
- ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సైదాపురం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. విత్తనాలు, ఎరువులు, అధికారుల సూచనలు, సలహాలు, వివిధ ప్రభుత్వ పథకాల కోసం జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండానే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాని ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు కొనుగోలు నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే వరకు, వారికి కావాల్సిన ఎరువుల నుంచి, వ్యవసాయానికి కావాల్సిన యంత్ర పరికరాల వరకు అన్నీ ఆర్బీకేల వద్దే సమకూర్చారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ, ట్రోల్ ఫ్రీ 155251 ద్వారా శాస్త్రవేత్తల సలహాలు అందించేలా చర్యలు చేపట్టారు. భూసార పరీక్షలు, పురుగు మందులు, క్రిమిసంహారక మందులు అందుబాటులోకి తెచ్చారు. దీనిపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కియోస్కర్ ద్వారా సేవలు అందిస్తున్న సిబ్బంది

రైతు భరోసా కేంద్రాల్లో అందుతున్న సేవలు

- భూసార పరీక్షలు
- వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా వ్యవసాయ పరికరాలు
- సున్నావడ్డీతో బ్యాంక్ రుణాలు
- పొలంబడి ద్వారా రైతులకు పొలాల్లోనే శిక్షణ
- సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు
- విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు
- సీఎం యాప్ ద్వారా పంటలకు గిట్టబాటు ధర
- డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈమల్టీ ఫంక్షన్ రియోస్కులు



రైతు ముంగిటకే ఎరువులు (ఫైల్)

పంటకు మద్దతు ధర



రైతులకు గత ప్రభుత్వం మొండి చేయి చూపించింది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు బిడ్డగా వారి కష్టాలను గుర్తించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. గతంలో పంట చేతికొచ్చే సమయంలో దళారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేవారు. ఇప్పుడు మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. సీజన్ ప్రకారం విత్తనాలు అందిస్తున్నారు. వాటికి కావాల్సిన మందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సమకూర్చుతున్నారు. వీటితో రైతులకు ఎంతో ఊరట లభిస్తోంది.

– భూపతి నాగభూషణం (రాపూరు, రాపూరు మండలం)

ఈక్రాప్‌తో రైతు సేఫ్



పంట సాగు చేసినప్పటి నుంచి కోత వరకు రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ చేపడుతున్నారు. పంటలు దెబ్బతింటే నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. పంట నష్టపోతే రైతుల పొలాల వద్దకు ఆర్బీకే సిబ్బంది వచ్చి అంచనాలు వేసి నష్ట పరిహారానికి సిఫార్సులు చేస్తున్నారు. కొన్ని రోజుల్లోనే నగదు రైతు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతోంది.

– ఏటూరి నరసారెడ్డి (కలువాయి, కలువాయి మండలం)

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

మండలం	ఆర్బీకేల సంఖ్య
సైదాపురం	19
రాపూరు	18
దక్కిలి	14
వెంకటగిరి	14
బాలాయపల్లి	15
కలువాయి	15
మొత్తం	95

ఆర్బీకే భవనాల నిర్మాణ వ్యయం రూ.19 కోట్లు

సబ్సిడీపై పనిముట్లు రూ.15కోట్లు

ఎరువులు 18 వేల మెట్రిక్ టన్నులు

రైతుల సంఖ్య 63 వేలు

ఆర్బీకేల్లోనే సబ్సిడీ ఎరువులు



నాలుగేళ్లుగా పంటకు కావాల్సిన ఎరువులు మా ఊరి రైతు భరోసా కేంద్రంలోనే అందుబాటులో దొరుకుతున్నాయి. ఏటా ఎరువుల కోసం మండల కేంద్రం, పక్కనే ఉన్న గూడూరుకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. అక్కడ దొరక్కపోతే ప్రయివేటు ఎరువుల దుకాణాలను ఆశ్రయించేవాళ్లం. వాళ్లిచ్చే నాసిరకం మందులు పంటకు వేసేవాళ్లం. దిగుబడి కూడా పెద్దగా ఉండేది కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక గ్రామాల్లోనే ఆర్బీకేలు వచ్చాయి. అక్కడే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు దొరుకుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– గుంటమడుగు శ్రీనివాసులురాజు (రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం మండలం)

తండ్రిని మించిన తనయుడు జగన్



ఆంధ్ర రాష్ట్రాన్ని అన్నపూర్ణ అని పిలుస్తుంటారు. అలాంటి రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలను చూసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞం ద్వారా రైతులకు సాగునీరు అందించారు. ఇప్పుడు ఆయన కుమారుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే అన్ని సేవలు అందేవిధంగా రైతు భరోసా కేంద్రాలు తీసుకొచ్చారు. తండ్రిని మించిన తనయుడుగా పేరుతెచ్చుకున్నారు. – కుంచం సుబ్బయ్య (సైదాపురం, సైదాపురం మండలం)

నకిలీ సమస్య తీరింది



రైతుభరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత నకిలీ విత్తనాల సమస్య తీరింది. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో విత్తనాలను రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. గతంలో ఇక్కడి రైతులు విత్తనాల కోసం గూడూరు, పొదలకూరు వెళ్లి కొనేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. రైతులు అప్పులు చేసే పరిస్థితి నుంచి గట్టెక్కించారు. ఆయనకు రైతులంతా అండగా నిలవాలి. – బండి రమేష్‌రెడ్డి (మోపూరు, దక్కిలి మండలం)

జగన్‌తోనే రైతుకు బతుకు




రైతు సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాగుకు అడుగడుగునా ప్రోత్సాహం కల్పించింది. గతంలో వ్యవసాయం చేసేందుకు రైతులు ఆసక్తి చూపే వారు కాదు. నేడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిద్వారా రైతన్నలకు వ్యవసాయంపై మరింత అవగాహన పెరుగుతోంది. – పీ.పెద్దపాపయ్య(డీ వడ్డిపల్లి, దక్కిలి మండలం)

ఇంతకన్నా ఏం కావాలి?



ఎరువులను ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతోంది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను ఆర్బీకేల ద్వారా అందిస్తోంది. అధికార యంత్రాంగాన్ని రైతుల వద్దకు పంపి అండగా ఉండేలా చూస్తోంది. ఇంతకన్నా ఏం కావాలి..?. – గార్లపాటి శంకరయ్య (రాపూరు, రాపూరు మండలం)

డిబేట్ల సవారీ
దర్శనాల దళారీ!



- శ్రీవారి దర్శనాల పేరుతో వసూళ్లు
- వీఐపీ, వీవీఐపీలొస్తే వారి అడుగులకు మడుగులు
- బ్రేక్ దర్శనాలు ఇవ్వకపోతే టీటీడీపై విమర్శలు
- తనకు మించిన మేధావి లేడంటూ తరచూ మీడియాలో చర్చలు
- నోటా ఓట్లతో కూడా పోటీపడలేని వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ గొప్పలు
- తిరుపతిలో ఆ వ్యక్తిపై షికార్లు కొడుతున్న పుకార్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో పే..ద్ద రాజకీయ నాయకుడినని చెప్పుకుంటూ దేవుడి దర్శనాల పేరుతో భారీగా డబ్బులు సంపాదించాడు. ఢిల్లీ లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వీఐపీ, వీవీఐపీల వెనుకే పాతుకుపోతాడు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగి నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాని ఆ దళారీ.. ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానంటూ పలువురు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఓ ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు.. కాదు కాదు.. గల్లీ నాయకుడు.. అయిన అతను తరచూ టీవీ డిబేట్లలోనే ఎక్కువగా కనిపిస్తుంటాడు. ఒకప్పుడు చంద్రబాబుని తిట్టేవాడు. ఇప్పుడు అధికార పార్టీని టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్నాడు. అదేవిధంగా టీటీడీపై ఏదో ఒక దుష్ప్రచారం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అందుకు కారణం లేకపోలేదు. అతను ఎప్పుడు అడిగితే అప్పుడు అడిగినన్ని బ్రేక్ దర్శనాలు ఇవ్వాలి. అలా ఇవ్వకపోతే టీటీడీపై లేనిపోని ఆరోపణలు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. అందుకోసమే ఉన్న ఎల్లో మీడియా అతన్ని పిలిచి డిబేట్లలో మాట్లాడించి రాక్షసానందం పొందుతోంది.

ఏడాదికి 300 లెటర్లా?

ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ఈ దళారి తిరుమల శ్రీవారి దర్శనాలను అడ్డు పెట్టుకుని ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగారు. గతంలో ఏడాదికి శ్రీవారి బ్రేక్ దర్శనాల కోసం 300 లెటర్లు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇతను గతంలో టీటీడీ బోర్డు సభ్యునిగా కూడా ఉన్నాడు. ధర్మకర్త పదవి అడ్డుపెట్టుకుని పలుకుబడి గలవారు, సంపన్నులు స్వామి దర్శనానికి వస్తే వారి వెంటే ఉండి దళారీ పనిచేయడం వృత్తిగా మార్చుకున్నాడనే ప్రచారం ఉంది. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుపతిలోని ఆ పార్టీ కార్యకర్తలకు గానీ, నాయకులకు గానీ ఒక్క దర్శనం టికెట్ కూడా ఇప్పించకుండా కోటా టికెట్లన్నీ గంపగుత్తుగా స్టార్ హోటళ్లకు అమ్మేసిన వైట్ కాలర్ దళారీగా మారాడు. ఈ దళారీ వ్యాపారానికి ప్రస్తుతం టీటీడీ చెక్ పెట్టడంతో చైర్మన్, ఈఓపై కక్ష పెంచుకుని బ్లాక్ మెయిల్ చర్యలకు పాల్పడుతున్నారు. ఇది టీటీడీ ఉద్యోగులకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. నాడు బోర్డు మెంబర్‌గా ఉన్న రెండేళ్లలో ఏ రోజూ తిరుమలలో భక్తుల సదుపాయాలు, అభివృద్ధి గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పోనీ తిరుపతి లో ఆ పార్టీ బలోపేతం చేయడానికైనా పనిచేశారా అంటే అదీ లేదు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో పి.బాలసుబ్రహ్మణ్యం అనే ఐఏఎస్ అధికారిని తొమ్మిదేళ్లకంటే ఎక్కువ కాలం తిరుమల జేఈవోగా కొనసాగారు. అప్పట్లో మూడు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఎప్పుడూ కూడా బాలసుబ్రహ్మణ్యంను 9 సంవత్సరాలకు పైగా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించిన పాపాన పోలేదు. మరో ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజును కూడా ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు 9 సంవత్సరాలకు పైగానే తిరుమల జేఈవోగా కొనసాగించారు. ఆయన హయాంలో కూడా రెండు సార్లు శాసనసభ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కూడా నోరెత్తలేదు. అటు వంటి దళారీ టీటీడీ ఈఓ మీద బురద చల్లడంతో పాటు టీటీడీని బజారుకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. టీటీడీలో పనిచేస్తున్న అధికారులు ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ పాల్గొనరు. కాబట్టి వారు ఎన్నికల బదిలీల పరిధిలోనికిరారు. ఈ విషయం తెలిసినా ఈఓని బదిలీ చేయాలని మీడియాలో రగడ చేస్తూ చీప్ పబ్లిసిటీ పొందే ప్రయత్నం చేస్తుండడంపై టీటీడీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేను పోటీ చేస్తున్నా.. విరాళం ఇవ్వండి

'ఈ సార్వత్రిక ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నా. సీటు ఖరారు అయ్యింది. ఎన్నికల ఖర్చు కోసం విరాళాలు ఇవ్వాలి' అని ఏపీతో పాటు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల నుంచి భారీగా వసూళ్లు చేశాడన్న వార్త తిరుపతిలో రెండు రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఓ వ్యాపారి వద్ద రూ.2 కోట్లు, చెన్నైకి చెందిన పారిశ్రామిక వేత్త నుంచి రూ.3 కోట్లు, తిరుపతిలోని పలువురు వ్యాపారుల నుంచి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం ఇప్పుడు బయటకు రావడానికి ప్రస్తుతం అతను అభ్యర్థిగా బరిలో లేకపోవడమే. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వలేదు కదా.. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వండి ప్లీజ్ అని అడుగుతుంటే ఆ గల్లీ లీడర్, దళారి తప్పించుకు తిరుగుతున్నాడని సమాచారం. ఫోన్ చేస్తే తియ్యడం లేదని చెప్పుకుంటున్నారు.

ఈఓని మార్పించేస్తా!

తను అడిగినప్పుడు బ్రేక్ దర్శనాలకు అనుమతివ్వడం లేదనే కక్షతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డిపై గత కొంత కాలంగా ఆరోపణలు చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధికి అడుగడుగునా అడ్డు పడుతూ... లేని పోనివి కల్పించి దుష్ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అంతటితో ఆగని ఆ దళారీ డబ్బులు గుంజుకోవడంతో పాటు.. తనకు అడ్డుపడుతున్న టీటీడీ ఈఓని బదిలీ చేయించే కుట్రలకు తెరలేపాడు. అందుకు టీడీపీ, జనసేన నేతలను పావుగా వాడుకుంటున్నాడు. ఈఓ ఉంటే ఎన్నికలకు ఇబ్బంది అవుతుందని వారిని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈఓని మార్చాలంటే ఖర్చు అవుతుందని, ఢిల్లీ వెళ్లాల్సి ఉంటుందని, భారీగా ఖర్చు అవుతుందని జనసేన అభ్యర్థిపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వెండి పద్మ పీఠం బహూకరణ



వెండి పద్మ పీఠాన్ని అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

తిరుపతి(అలిపిరి): క్రోధినామ ఉగాది రోజున ముంబైకి చెందిన లక్ష్మీనారాయణ రూ.4.38 లక్షల (4.65 కిలోలు)తో తయారు చేసిన వెండి పద్మ పీఠాన్ని ముంబైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బహూకరించారు. ఈ విరాళాన్ని దాత కుటుంబ సమేతంగా మంగళవారం ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌కు అందించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

– 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని ×మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్‌ॅ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

రాజకీయాలకే ఆదర్శం.. జగనన్న సంక్షేమం

- ప్రజలను వంచించడానికే చంద్రబాబు కూటమి
- చంద్రబాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా గెలుపు జగనన్నదే
- తిరుపతి ప్రజల గుండెల్లో అభివృద్ధి ప్రదాతగా అభినయ్
- 8, 9 డివిజన్లలో జోరుగా ఎమ్మెల్యే భూమన ఎన్నికల ప్రచారం


8వ డివిజన్‌లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంను గజ మాలతో సత్కరిస్తున్న స్థానికులు, కార్పొరేటర్ మునిరామిరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు ప్రపంచ రాజకీయాలకే ఆదర్శంగా నిలిచాయని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తిరుపతి నగరంలోని 8, 9 డివిజన్లలో కార్పొరేటర్లు తిరుపతి మునిరామిరెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ మునిరామిరెడ్డితో పాటు ఆ వార్డు నాయకులు పార్టీ రంగులతో కూడిన భారీ గజమాలతో కరుణాకరరెడ్డిని సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురాలోచనతో చంద్రబాబు కూటమి ఏర్పాటు చేసుకున్నాడని మండిపడ్డారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలను మోసగించడం తప్ప చిన్నపాటి మేలు చేసిన పాపానపోలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేశాడు కాబట్టే జగనన్న సింగిల్‌గానే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడని, ప్రజలంతా జగనన్నకే మద్దతుగా ఉన్నారన్నారు.

అభివృద్ధి ప్రదాత అభినయ్

గతంలో ఎన్నడూ లేనంతగా తిరుపతిని అభివృద్ధి చేసి నగర ప్రజల గుండెల్లో అభివృద్ధి ప్రదాతగా భూమన అభినయ్‌రెడ్డి స్థానం సంపాదించుకున్నాడని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి కొనియాడారు. తిరుపతి నగర ప్రజలే తన కుటుంబం అనుకుని ప్రజాసంక్షేమం, నగర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాడని తెలిపారు. 22 మాస్టర్‌ప్లాన్ రోడ్లను ఏకధాటిగా నిర్మించడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లతో పాటు ప్రధాన కూడళ్ల సుందరీకరణ, ఫ్లైఓవర్లు వంటివి నగరానికే ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయన్నారు. తిరుపతిని ఇంతలా అభివృద్ధి చేశాడు కాబట్టే తిరుపతి ప్రజలంతా అభినయ్‌ని గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారన్నారు. ఓట్లు కోసం ఏ గడపకు వెళ్లినా ఎంతో ఆప్యాయంగా ఆదరిస్తున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పందలూరు పెంచులయ్య, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, కంకనాల రమేష్, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, ఆరణి సంధ్య, కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి, పార్టీ నాయకులు మురళి, మహ్మద్‌కాసీమ్(చోటా బాయ్), గఫూర్, రవిచంద్ర, సుబ్బు, మద్దాలి శేఖర్, సురేంద్రరెడ్డి, పెరుగు బాబూయాదవ్, గీతాయాదవ్, శారద పాల్గొన్నారు.

టీడీపీ, కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

తిరుపతి 8వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ డివిజన్ కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీకి చెందిన చంద్రయాదవ్, ప్రభాకర్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.


8వ డివిజన్ ఎర్రమిట్టలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన చంద్రా యాదవ్‌తో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


సుభాష్‌నగర్‌లో టీడీపీ నేత వై.ప్రభాకర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ఆర్‌ఎఫ్ రోడ్డుకు చెందిన సన్నీ, తన స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంలో తిరుపతి మార్గంలోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇండియన్ బ్యాంకు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సన్నీతో పాటు మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సన్నీ మెడకు తీవ్ర గాయం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్న ట్లు వైద్యాధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


మృతి చెందిన యశ్వంత్ శర్మ

చంద్రగిరి: బావిలో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మొండికాలువ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... చంద్రగిరి పాతపేట దిగువవీధికి చెందిన కామేష్‌శర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు యశ్వంత్ కుమార్‌శర్మ(24)తో పాటు అతని స్నేహితులు మొండికాలువ సమీపంలోని వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. తన స్నేహితులు బావిపై నుంచి చూస్తుండగా యశ్వంత్‌శర్మ ఒక్కసారిగా బావిలో దూకాడు. ఆపై ఎంతకీ పైకి రాకపోవంతో యువకులు స్థానికులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యశ్వంత్ శర్మను చంద్రగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు యశ్వంత్ శర్మ అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గరుడ వాహనంపై కోదండరాముడి కటాక్షం


గరుడ వాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి సర్వాంగ సుందరంగా శ్రీకోదండరామస్వామి గరుడ వాహనంపైనుంచి భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు కదులుతుండగా, భజన బృందాల కోలాటాల మధ్య భక్తజనం రామనామం నడుమ స్వామివారి గరుడ వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 8 గంటలకు స్వామివారి పల్లకీసేవ వేడుకగా సాగింది. ఈ సందర్భంగా మోహినీ అవతారదారుడైన శ్రీరామచంద్రుడు పల్లకిలో కొలువై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాముల వారి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, వీజీఓ బాలిరెడ్డి, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టార్ సీతారామాచార్యులు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




గరుడ వాహ నసేవలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ అధికారులు, వాహన సేవలో భజనలు చేస్తున్న కళాకారులు

వేడుకగా ఉగాది ఆస్థానం

- తుమ్మలగుంటలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి ప్రత్యేక పూజలు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు
- పంచాంగ శ్రవణం చేసిన ఆలయ అర్చకులు


ఉగాది ఆస్థానంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట గ్రామంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుప్రభాతం, అనంతరం శుద్ధి నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు తీసుకుని ఆలయం ధ్వజస్తంభం చుట్టూ తిరిగి ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత శ్రీవారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం పంచాగ శ్రవణం పఠించారు. ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పంచాంగ శ్రవణం.. సర్వకార్య శుభప్రదం

ఉగాది రోజున నిర్వహించే పంచాంగ శ్రవణం.. సర్వకార్య శుభ, ఫలప్రద దాయకమని.. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలకు అన్ని కార్యాల్లో శుభాలు, ఆయురారోగ్యాలు పుష్కలంగా అందాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆకాంక్షించారు. స్వామి, అమ్మవార్లకు జరిగిన ఉగాది ఆస్థానం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉగాది ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసు

కొత్త ఉషస్సుల క్రోధి

శ్రీకాళహస్తి: జిల్లాలో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని శైవక్షేత్రాల్లో శ్రీక్రోధి నామసంవత్సరాన్ని పురస్కరించుకుని పంచాంగశ్రవణం వినిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య చందనం, పంచామృతం, క్షీర, నారికేళం జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విరబూసిన కవి సమ్మేళనం


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న చెవిరెడ్డి దంపతులు


స్వామి,అమ్మవార్ల ప్రత్యేక అలంకరణ

క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని కైకాలవారి కల్యాణ మండపంలో ఉగాది కవి సమ్మేళనం గొడుగుచింత గోవిందయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన కవులు వారి స్వీయ కవితను వినిపించారు. అనంతరం లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలను వారి కుమార్తెలు కిరణ్మయి, కృష్ణశశికి శతావధాని ఆముదాల మురళి, రచయిత చెంచుకృష్ణ అందజేశారు. రూ.25 వేల నగదు బహుమతితో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువశ్రీ మురళి, జయచంద్రరావు, తీగల వెంకటయ్య, గురునాథం, గణేష్, రవీంద్ర, బాలముని, శివకుమార్, సుబ్బారెడ్డి, నారాయణస్వామి, దేవీప్రసాద్, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహతిలో ఆకట్టుకున్న పంచాగ శ్రవణం


పంచాంగ శ్రవణం చేస్తున్న ఆచార్య వేదాంత విష్ణుభట్టాచార్యులు


తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్యులు ఆచార్య వేదాంత విష్ణుభట్టాచార్యులు పంచాంగ శ్రవణం చేస్తూ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములను తెలుసుకోవడమే పంచాంగమని తెలిపారు. అనంతర ఆయా రాశుల వారికి ఈ సంవత్సరంలో కలిగే ఫలాలను తెలియజేశారు. పంచాంగ కర్తను శ్రీవారి ప్రసాదం, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. తర్వాత ఆచార్య దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో ఆముదాల మురళి అష్టావధానం చేపట్టారు. చివరిగా టీటీడీ ఉద్యోగుల పిల్లలకు సంప్రదాయ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత పాల్గొన్నారు.

సువర్ణ పాలన జగనన్నకే సాధ్యం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించేలా ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకులు శ్రమించాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో మళ్లీ సువర్ణ పరిపాలన రావాలంటే అది జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. బీసీ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రజాదరణ బాగుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు దొంతుశారద, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

'కోడ్' నిబంధనలు బేఖాతర్!


టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం ఎన్నికల అధికారుల ప్రాథమిక విధి. టీడీపీ నాయకులు నగరంలోని ఐటీఐకు వెళ్లేదారిలో రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మూడు బ్యానర్లు ఏర్పాటు చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పేరుతో నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విమర్శలకు తావిస్తోంది.